

బోటు షికారు లేదాయె..
చెరువుల్లో నీరు నిండుగా ఉన్నా బోటు షికారు కరువైంది. ఉన్నవి కూడా నిత్యం మరమ్మతులకు గురికావడంతో పర్యాటకుల సంఖ్య తగ్గిపోతోంది. -8లో



రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి
పంటల సాగులో రైతులకు తగిన సూచనలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయ అధికారులు అయితా నాగేశ్వర రావు, చంద్రనాయక్ సూచించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.350
రెండోరకం	రూ.200	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 82 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

చేనేత క్లస్టర్ పనుల తనిఖీ
సిద్దవటం: మాధవరం–1 గ్రామం ఎస్‌కేఆర్ నగర్‌లోని చేనేత క్లస్టర్‌ల ప్రహరీ పనులను శనివారం హౌసింగ్ పీడీ రాజారత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత క్లస్టర్‌లో జరిగే పనుల్లో నాణ్యతాలోపం ఉంటే గుత్తేదారుకు బిల్లులు నిలిపివేస్తామన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేఈ ప్రేమ్‌దాస్, కాంట్రాక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక
రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా రాయచోటిలో రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా రాజా ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ మన్నూరు హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీ శ్రీనివాస ఒకేషనల్ జూనియర్ కళాశల కరెస్పాండెంట్ దూలం నరేంద్రబాబు, జిల్లా కోశాధికారిగా చందన ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ రాజేశ్వరి, జిల్లా సెక్రటరీగా కల్పన ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ కల్పన, జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎంజెఆర్ రామచంద్రారెడ్డి, గౌరవ సలహాదారునిగా సాయిబాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల నాగభూషణంలను ఎన్నుకున్నారు.

జనవరి 14లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
రాయచోటి అర్బన్: పరీక్షా పే చర్చ -2025 కార్యక్రమంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవడానికి వచ్చే ఏడాది జనవరి 14వరకు గడువు ఉందని డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యాపరమైన సవాళ్లకు, వినూత్న పరిష్కారాలను చర్చించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఎంపిక చేసిన వారిని ఈవెంట్‌లో ప్రశ్నలు అడగ డానికి, ప్రధానమంత్రితో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల ల్లో 6నుండి ఇంటర్‌వరకు విద్యార్థులు అన్ని తరగతుల విద్యార్థుల తల్లితండ్రులు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో బోధించే ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు www.mygov.in అధికారిక పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు.కార్యక్రమానికి జిల్లా నోడల్ అధికారులుగా డైట్ అధ్యాపకులు నాగరాజు (90009 10895), అసదుల్లా(9440084715)లు వ్యవహరిస్తారన్నా రు.

జేఎల్‌ఎంపై డీఈ, ఏఈలకు ఫిర్యాదు
రాయచోటి: మద్యం తాగి విధులకు ఆటంకం కలిగించిన గ్రేడ్ 2 జూనియర్ లైన్‌మెన్ భాస్కర్‌పై రాయచోటి ట్రాన్స్‌కో డీఈ, ఏఈలకు విధులలో ఉన్న సిబ్బంది లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి 12 గంటలకు జూనియర్ లైన్‌మెన్ మద్యం తాగి ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఉన్న సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న లైన్‌మెన్, మరో ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లపై ఇష్టం వచ్చిన రీతిలో చిందులు వేశారు. వారు వారించి బయటకు పంపినా భాస్కర్ వినకుండా పట్టణంలోని పశ్చిమ వైపు విద్యుత్ సరఫరా అవుతున్న లైన్ ఫీజులను తొలగించాడు. దీంతో ఆ ప్రాంతమంతా చీకటిమయంగా మారింది. అర్ధరాత్రి అనంతరం గంటల తరబడి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జరిగిన సంఘటనపై రాత్రి డ్యూటీలో ఉన్న లైన్‌మెన్, ఇద్దరు అసిస్టెంట్లు రాయచోటి ట్రాన్స్‌కో డీఈ, ఏఈలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిధుల దుర్వినియోగం.. ఐదుగురు సస్పెన్షన్



పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం 17వ విడత ఉపాధి హామీ బహిరంగ విచారణ జరిగింది. ఎస్‌ఆర్‌పీ సుబ్బారావుతో పాటు ఎనిమిది మంది డీఆర్పీలు నిధుల దుర్వినియోగంపై బహిరంగ సభలో వెల్లడించారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరువరకు మండలంలో మొత్తం 1716 పనులు జరిగాయి. ఈపనులకు మొత్తం రూ.8.77 కోట్లు నిధులు వెచ్చించారు. ఉపాధి హామీలో రూ. 5,12,344 నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ. 3.500, ఇతర శాఖల్లో రూ.91,327 మొత్తం రూ.6, 07.199 నిధులు దర్వినియోగం అయినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం వెల్లడించారు.నిధుల దుర్వినియోగానికి కారకులైన టెక్నికల్ అసిస్టెంట్ శంకర్‌తో పాటు దేవప్పకోట, టీ. సదుం, పెద్దతిప్పసముద్రం, కాట్నగల్లు పంచాయతీల్లో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించామని అధికారులు వెల్లడించారు.ఈ సభలో ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ అబ్బుల్ ఖలామ్ అజాద్, ఏపీఓ తిరుపాలప్ప పాల్గొన్నారు.



జననేత జన్మదినం ▸ జగమంతా సంబరం

- మాజీ సీఎం వైఎస్ జగన్ నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్ష
- పలుచోట్ల వృద్ధులకు దుస్తులు, రోగులకు బ్రెడ్లు, అన్నదానాలు చేపట్టిన నేతలు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో జన్మదిన వేడుకలకు మోకాలొడ్డిన పోలీసులు



సిద్దవటం పరమాత్మాసేవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



రైల్వేకోడూరు: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

సాక్షి రాయచోటి: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలకాలం వర్ధిల్లాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం వాడవాడలా కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం మొదలుకొని వస్త్రదానం వరకు పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. మాజీ సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నేతలంతా ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాల్లో మునిగిపోయారు. రు

- జిల్లాలోని రాజంపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందుగా పాత బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆకేపాటి కేక్ కట్ చేశారు. అంతేకాకుండా నందలూరులో కూడా జిల్లా అధ్యక్షులు ఆకేపాటి పాల్గొన్నారు. రాజంపేటలోని మేడా భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీ మేడా రఘునాథరెడ్డి అనుచరులు కేక్ కట్ చేసి జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సుండుపల్లెలో నేతలు కేక్ కట్ చేయడంతోపాటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వీరబల్లిలో పార్టీ నేత గాలివీటి వీరనాగిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.
- మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా మదనపల్లె దేశాయి ఫంక్షన్ హాల్, అవెన్యూ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త నిషార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజా రెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, రాష్ట్ర నాయకులు బాబ్జాన్ తదితరులు నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డితో కలిసి రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. జగనన్న జన్మదినం సందర్భంగా ఎన్నారై దండు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బసినికొండ కూరపర్తి అనాథ ఆశ్రమానికి రూ 28,000 విలువ చేసే ఫ్రిడ్జిని కానుకగా అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త రామకృష్ణకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగు చంద్ర, సిటిఎం సర్పంచ్ ఆనంద పార్థసారథి రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.
- రైల్వేకోడూరు నియోజకవర్గంలో మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కొరముట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు పంజం సుకుమార్‌రెడ్డి, ధ్వజారెడ్డిల ఆధ్వర్యంలో కొరముట్ల శ్రీనివాసులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఓబులవారిపల్లె మండలంలోని వై.కోటలో మండల కన్వీనర్ సాయి కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో 52 కిలోల కేక్ కట్ చేసినంతరం జీవనజ్యోతి ఆనంద నిలయంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. పెనగలూరు, పుల్లంపేట, చిట్వేలి తదితర మండలాల్లో కూడా జన్మదిన వేడుకలు నిర్వహించారు.
- జిల్లా కేంద్రం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, బీసీ నాయకులు పల్లా రమేష్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేయగా, చిన్నమండెంలో మాజీ జెడ్పీవైస్ చైర్మన్ దేవనాథరెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. తమిళనాడులోని నాగూర్ దర్గాలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలోపార్టీ శ్రేణులు కేక్ కట్ చేయగా, సంబేపల్లెలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పీలేరు నియోజకవర్గకేంద్రంలోని పీఎల్ఆర్ అపార్టుమెంటులో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనికేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ అంగళ్ల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయితే తంబళ్లపల్లెలోని ప్రధాన రహదారిలో వైఎస్‌జగన్ జన్మదిన వేడుకల కార్యక్రమాలు నిర్వహించరాదంటూ పోలీసులు ఆంక్షలు విధిస్తూ బందోబస్తు ఏర్పాటు చేయడంపై పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. అయినప్పటికీ ఎక్కడికక్కడ నియోజకవర్గంలోని అన్నిచోట్ల జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.



రాయచోటిలో జగనన్న జన్మదిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తదితరులు



సుండుపల్లె: రోగులకు పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓవరాల్ చాంపియన్ 'కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్'

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్–2024–25 ఘనంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షత నిర్వహించిన ఈ పోటీలలో ఉమ్మడి కడపజిల్లాలోని 14 పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కత్రో, బ్యాడ్మింటన్, పరుగుపందెం, ఖో ఖోలను నిర్వహించారు. ఈ పోటీలలో ఇండ్యూజువల్ చాంపియన్స్‌గా పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతోపాటు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిలిచారు. దీంతోపాటు ఓవరాల్ చాంపియన్స్‌గా కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థినిలకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతితో కలిసి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బందితోపాటు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కలెక్టర్ మానవత్వం

కిడ్నీలు పనిచేయని విద్యార్థినికి రూ.లక్ష అందజేత

రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టర్ మానవత్వం చాటుకున్నారు. రెండు కిడ్నీలు దెబ్బతిని, డయాలసిస్ చేయించుకుంటున్నా.. చదువుపై ఉన్న మమకారంతో ఆసుపత్రిలో ఒకవైపు చికిత్స పొందుతూ మరో వైపు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని బి.జాహ్నవికి తన వంతు సహకారంగా సొంత నిధుల నుంచి లక్ష రూపాయలను అందజేశారు.వివరాలు..కలెక్టం శ్రీధర్ కెవీ పల్లి ఆదర్శ పాఠశాలను నవంబర్ 27న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి.జాహ్నవికి రెండు కిడ్నీలు పనిచేయని విషయాన్ని అక్కడ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి కలెక్టర్ ధైర్యం చెబుతూ వైద్య సహాయం నిమిత్తం మరిన్ని వివరాలతో కలెక్టరేట్‌లో కలవాలని పాఠశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. ఈ మేరకు శనివారం పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ యండపల్లి బాలాజీ, విద్యార్థిని జాహ్నవి, తల్లి కాంతమ్మలు కలెక్టర్‌ను కలిశారు. వైద్య ఖర్చుల నిమిత్తం తన వ్యక్తిగత నిధుల నుంచి లక్ష రూపాయల చెక్కును జాహ్నవికి కలెక్టర్ అందజేశారు. కలెక్టర్‌కు విద్యార్థిని, ఆమె తల్లి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థిని జాహ్నవికి చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

సామన్యుడికి ధరాఘాతం

కొండెక్కిన కూరగాయల ధరలు

మదనపల్లె సిటీ: చుక్కలనంటిన కూరగాయలను చూసేందుకు సామన్యుడు భయపడుతున్నాడు. కాగుతున్న నూనెల ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నాడు. ఉల్లి, వెల్లుల్లి మాట వినపడితేనే ఉలిక్కిపోతున్నాడు. చివరకు ఆకుకూరలను అందుకునేందుకు కూడా జేబులు సరి చేసుకుంటున్నాడు. కనీసం కోడిగుడ్లు తెచ్చుకునేందుకు సైతం ఒకటికి పది పర్యాయాలు ఆలోచిస్తున్నాడు. నిత్యంపైకి చూస్తున్న ధరలను చూసి ఆందోళన చెందుతున్నాడు.

- నిత్యావసర సరుకులు.. కూరగాయలు.. కోడిగుడ్లు .. ఇలా ఏం కొనాలన్నా పెరిగిన ధరలకు వినియోగదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. మార్కెట్‌లో ఈ రోజు ఉన్న రేటు మరుసటి రోజు ఉండటం లేదు. బియ్యం, పప్పుదినుసులు,నూనె, కారం తదితర వస్తువుల ధరలు ఆకాశ్నంటుతున్నాయి. ధాన్యం ధర పడిపోయినప్పటికీ బియ్యం ధర తగ్గడం లేదు. ఇక ఉల్లి, వెల్లుల్లి, వైపు చూడటానికి కూడా జంకే పరిస్థితి.

వర్షానికి దెబ్బతిన్న పంటలు: ఇటీవల తుఫానుల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు తెగుళ్లు సోకడంతో పంటలు దిగుబడులు తగ్గిపోయాయి.మార్కెట్‌కు ఉత్పత్తులు తక్కువగా వస్తున్నాయి. దీని కారణంగా కూరగాయాల ధరలు పెరిగిపోతున్నాయి. అలాగే పెళ్లిళ్ల సీజన్‌తో పాటు అయ్యప్పమాలాధారుల సీజన్ కావడంతో కూరగాయలు ధరలు పెరగడానికి కారణమవుతోంది.



మదనపల్లె రైతు బజారులో కూరగాయల అమ్మకాలు

ఆకుకూరలు	ధర కట్ట 1కి (రూ.లో)
కొత్తిమీర	20
పుదీన	30
తోటకూర	25
పాలకూర	30
గోంగూర	30
సిర్రాకు	30
చుక్కఆకు	30
మెంతిఆకు	30
కరివేపాకు	80 (కేజీ)

మరింత పెరగనున్న ఉల్లిగడ్డలు: ఉల్లిగడ్డల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వారం కిందట కిలో రూ.30 నుంచి రూ.40 వరకు పలికింది. ప్రస్తుతం రూ.70కు చేరింది. మరో వారంలో కిలో రూ.100కు చేరే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రంలో సాగు తగ్గడం, మార్కెట్లోకి సరిపడా ఉల్లి(ఎర్ర)గడ్డలు రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. డిమాండ్ పెరగడంతో ధరలు కూడా పెరుగుతున్నాయని, మరో రెండు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చునని చెబుతున్నారు.

కొనుగోలుకు వెనుకంజ: అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుడు కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నాడు. దీంతో వ్యాపారాలు పడిపోయినట్లు దుకాణాదారులు వాపోతున్నారు. కూరగాయల్లో ఏది కొనుగోలు చేయాలన్నా రూ.40 నుంచి రూ.100 వరకు చేరింది. కంది పప్పు కిలో రూ.180 నుంచి రూ.190,శనగపప్పు రూ.95 నుంచి రూ.100, నూనె రూ.135 నుంచి 165 వరకు పలుకుతోంది.

కూరగాయలు	కేజీ ధర (రూ.లో)
వంకాయలు	60
టమాటా	30
బెండకాయలు	80
పచ్చిమిర్చి	60
కాకరకాయలు	50
క్యారెట్	60
బీరకాయలు	70
బెండకాయలు	80
బంగాళ దుంపలు	60
ఉల్లిపాయలు (కర్నూలు)	60
ఉల్లిపాయలు (మహారాష్ట్ర)	70
తెల్లగడ్డలు	420
అల్లం	80
గోరుచిక్కుడు	70
బీట్‌రూట్	70
క్యాప్సికమ్	80
అనపకాయలు	50
బీన్సు	60

ఇబ్బందిగా ఉంది



ప్రస్తుతం అన్ని రకాల నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. ఆకుకూరలు, కూరగాయల నుంచి వంట సరుకులు కూడా ధరలు పెరిగిపోయాయి. దీంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం. ఏం కొనాలన్నా ఇబ్బందిగా ఉంది. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రెడ్డెమ్మ, గృహిణి, చంద్రకాలనీ, మదనపల్లె

వర్షాలే కారణం



ఇటీవల కురుస్తున్న వర్షాలతో కూరగాయల ధరలు పెరిగిపోయాయి. పంటలు దెబ్బతినడంతో సరుకు తక్కువగా వస్తోంది. మరో నెల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. వాతావరణం అనుకూలిస్తే ధరలు తగ్గవచ్చు. రీటైల్ మార్కెట్ కంటే రైతుబజారులో తక్కువ ధరలకు విక్రయిస్తున్నాం.

-కె.వెంకటరమణ, కూరగాయల వ్యాపారి, మదనపల్లె.

ఏమీ కొనలేము



ఏది కొందామన్నా రేట్లు మండిపోతున్నాయి. రూ.500 తెస్తే నాలుగైదు కూరగాయాలు వస్తున్నాయి. సామాన్యులు కూరగాయాలు కొనలేని స్థితిలో ఉన్నారు. కనీసం ఆకు కూరల ధరలు కూడా మండిపోతున్నాయి.

-ముస్తాఫా, కురబలకోట.

▸▸ చిన్నారికి అభినందన

రాయచోటి: ఇండియా బుక్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి అవార్డు పొందిన షేక్ మహమ్మద్ ముస్తాక్ సిద్దిక్‌ను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో షేక్ మహమ్మద్ ముష్తాక్ సిద్దిక్ తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిశారు. రాజంపేట పట్టణం ముకుంధర్ గడ్డకు చెందిన వీఆర్ఓ షేక్ ముజీబ్, షేక్ మసుధ బేగం దంపతుల కుమారుడు షేక్ మహమ్మద్ ముష్తాక్ సిద్దిక్ ఇండియా బుక్ రికార్డ్స్‌లో అవార్డు పొందిన విషయం తెలిసిందే. తమ కుమారుడు చిన్న వయస్సు నుంచే ఎంతో చలాకీగా ఉండేవాడని, ప్రస్తుతం ఒకటిన్నర సంవత్సరాల వయస్సులో 27 రకాల పండ్లు, కూరగాయలు, జంతువులు, పక్షులను, వృత్తులను పక్షుల శబ్దాలు స్పష్టంగా గుర్తించడంతో ఇండియా బుక్ రికార్డ్స్‌లో వారు ఇటీవల బాలుడికి అవార్డు జారీ చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకునేలా చిన్నారిని బాగా చదివించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు.



ఇండియా బుక్ రికార్డ్స్ అవార్డును అందుకున్న చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కుమ్మరపల్లెకు చెందిన 13 సంవత్సరాల బాలిక శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని శనివారం బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంబేపల్లె ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బసినికొండ పుంగనూరు రోడ్డు సాయిబాబా టెంపుల్ వద్ద నివాసం ఉన్న డ్రైవర్ ఎస్.ఎం.డీ.షా అలీ ముర్షాద్(35) ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. బంధువులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం అతడి భార్య షేక్‌నూరీ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీ

– ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.మహేష్

ఓబులవారిపల్లె : మండలంలోని రెడ్డిపల్లి చెరువు కట్ట సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఉదయం రెండు లారీలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా నుంచి ఓబులవారిపల్లెకు గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్తున్న లారీ తమిళనాడు నుంచి సరుకు తీసుకు వెళ్తున్న కంటైనర్ లారీ రెడ్డిపల్లి చెరువు కట్ట వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో రెండు లారీల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. లారీ డ్రైవర్లు ఇద్దరు క్యాబిన్‌లో ఇరుక్కుపోగా జేసీబీ సహాయంతో రెండు లారీలను విడదీసి తీవ్రంగా గాయపడిన డ్రైవర్లను బయటకు తీశారు. డ్రైవర్లు మూర్తి, నల్లబోతుల వెంకటేశ్వర్లును 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్యాస్ సిలిండర్లు ఉన్న లారీ డ్రైవర్ నల్లబోతుల వెంకటేశ్వర్లు వేగంగా రాగ్ రూట్‌లో రావడమే ప్రమాదానికి కారణమైందని మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

బోటు షికారు లేదాయె..
బోలెడన్ని సమస్యలాయె.!

- నీళ్లున్నా.. నిధులు, బోట్లు కరువు
- నీరసించిన బోటు షికారు
- యూనిట్లు ఎక్కువ.. వసతులు తక్కువ



షికారుకు సిద్ధంగా దేవుని కడప చెరువులోని బోటు

కడప కల్చరల్ : లాహిరి లాహిరి లాహిరిలో ... అంటూ, అలా అలా చెరువు నీళ్లలో షికారు చేయాలని అందరికీ ఆశ ఉంటుంది. గమ్మత్తైన ఆ అనుభూతి కోసం అంతో ఇంతో ఖర్చు చేసేందుకు కూడా ప్రజలు వెనుకాడరు. కానీ సమీపంలోని చెరువుల్లో నీరు నిండుగా ఉన్నా బోట్లు అందుబాటులో లేకపోవడం, ఉన్నవి కూడా నిత్యం మరమ్మతులకు గురికావడంతో పర్యాటకుల సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. ఫలితంగా ఈ రంగానికి అనువుగా ఉన్నచోట కూడా ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

ఉన్న బోటింగ్ యూనిట్లు మూసివేయాల్సిన పరిస్థితి

జిల్లాలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని బోటింగ్ యూనిట్లు నానాటికి తీసి కట్టు అన్నట్లు మారుతున్నాయి. ఒక్కసారి పెట్టుబడికి సంవత్సరాల తరబడి ఆదాయం అందించే అవకాశం ఉంది. కానీ సౌకర్యాలు లేక ఉన్న బోట్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో పనికిరాకుండా పోతున్నాయి. మంచి ఆదాయాన్ని చేకూర్చిపెట్టే బోటింగ్ యూనిట్లు నానాటికి నష్టాలనే మిగిలిస్తున్నాయి

దేవుని కడప చెరువు యూనిట్

దేవుని కడప చెరువులోని బోటింగ్ యూనిట్ కేవలం ఒక్క బోటుతోనే కొనసాగుతోంది. అది కూడా తరచూ మరమ్మతులకు గురవుతోంది. టిక్కెట్ ధర రూ. 100 కావడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. ఎక్కువ మంది సభ్యులుగల కుటుంబం ఒకేసారి ఎక్కేందుకు అవకాశం లేకపోవడం కూడా ప్రజలను నిరాశకు గురి చేస్తోంది. నిజానికి ఇక్కడ పెట్రోలు బోట్ల కంటే పెడలింగ్ బోట్లు కనీసం రెండైనా అవసరం. కానీ ఆ సౌకర్యాలేవీ లేకపోవడంతో ఇది నగరంలోనే అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నా కలెక్షన్లు పూర్తిగా తగ్గిపోయి దాదాపు మూసివేసే స్థితికి చేరింది.

ఒంటిమిట్ట

ఒంటిమిట్ట చెరువులో బోటింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. టికెట్ల విక్రయాల కోసం కౌంటర్‌ను కూడా నిర్మించారు. కానీ అప్పుడప్పుడు (బ్రహ్మోత్సవాల సందర్భంగా) ఒకటి, రెండు బోట్లు తెప్పించి మమ అనిపిస్తున్నారు. ఆ తర్వాత షరామామూలుగా మూసి వేస్తున్నారు. రెండు, మూడేళ్లుగా ఈ యూనిట్ బ్రహ్మోత్సవాల సమయంలో కూడా మూసివేసే ఉంది.

మైలవరం...ప్రత్యేకం

ఈ యూనిట్‌కు అంటూ ప్రత్యేకంగా ఒక్క బోటు కూడా లేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న స్థానికులైన ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా బోట్లు నిర్వహించుకుంటూ అక్రమంగా ఆదాయం గడిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ ఇదే పరిస్థితి ఉందని సమాచారం. వ్యతిరేకుల ఫిర్యాదుతో అక్రమంగా తిరుగుతున్న బోటుని ఇటీవల అధికారులు సీజ్ చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ బోటులోని ఇంజిన్ చోరీకి గురైంది. అక్కడ సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ కూడా ఉండగా బోటు ఇంజిన్ ఎలా చోరీకి గురయిందో దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అన్నీ అరకొరగా..



పార్నపల్లెలోని యూనిట్‌లోని ఓ బోటు

జిల్లాలో మొత్తం ఐదు బోటింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో పార్నపల్లె యూనిట్ మూడు బోట్లతో ఓ మోస్తరుగా ఉండగా, కడప నగరంలోని దేవుని(పాత)కడప యూనిట్ కేవలం ఒకే ఒక బోటుతో ఉంది. నాలుగు సీట్లు గల ఈ బోటులో ఒక్కొక్క టికెట్టు ధర రూ. 100 రూపాయలు. దీంతో ధర ఎక్కువ అని, కేవలం నాలుగు సీట్లు ఉన్నాయని, అంత కుమించిన కుటుంబ సభ్యులు వెళ్లే అవకాశం లేదంటూ వచ్చిన వారు కూడా తిరిగి వెళ్లిపోతున్నారు. ఉన్న ఒక్క బోటు కూడా తరచూ మరమ్మతులకు గురై అందుబాటులో లేకపోవడంతో పర్యాటకుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోయింది. ఫలితంగా ఈ యూనిట్ ఎక్కువ రోజులు మూసి ఉంచాల్సి వస్తోంది. పార్నపల్లె బోటింగ్ యూనిట్లో ఆరు సీట్లు గల స్పీడ్ బోటు ఒకటి. 24 సీట్లు గల డీలక్స్ బోటు ఒకటి, 12 సీట్లుగల పాంటూన్ బోటు ఒకటి అందుబాటులో ఉన్నాయి. స్పీడ్ బోటులో టిక్కెట్ ధర రూ. 100, ప్యాంటూన్ బోటులో రూ. 75, డీలక్స్ బోటులో రూ. 50 లుగా సాగుతోంది.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌కు చెందిన కురవ నరేష్‌కుమార్ (42) అనే ఆటో డ్రైవర్ అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరేష్‌కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య గౌరి, బీటెక్ చదివే కుమారుడు ఉన్నారు. ఇటీవల అతను అధికంగా అప్పులు చేసి మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో ఇంట్లోని రేకుల పైపునకు చీర చుట్టుకొని శనివారం ఉదయం ఉరేసుకున్నాడు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

ఇద్దరు న్యాయవాదులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకుంటున్న న్యాయవాదులు

నందలూరు : నందలూరు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ అలీ, సెక్రటరీ సుబ్బరామయ్యలు మధ్యవర్తిత్వంపై జరిగిన శిక్షణలో పాల్గొని సర్టిఫికెట్లు పొందారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఏపీ హైకోర్టు జడ్జి నరేందర్ వీరికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కడప జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన ఐదురోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో రైతులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ అధికారులతోపాటు ఏడీఏలు కృషి చేయాలని కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులు అయితా నాగేశ్వరరావు, చంద్రనాయక్ సూచించారు. శనివారం కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన ఏడీఏలకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు రెండు జిల్లాల్లోని ఆయా డివిజన్ల వారీగా సాగైన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ల వారిగా వ్యవసాయ అధికారులతోపాటు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. సీజన్ వారిగా పంటలసాగు విషయంలో రైతులకు తగిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అలాగే మండలాలు, డివిజన్ల పరిధిలో ఎరువులు, పురుగు మందుల ధరల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేవీకే, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్లు డాక్టర్ వీరయ్య, డాక్టర్ అంకయ్యకుమార్‌లు మాట్లాడుతూ పంటలకు ఆశించిన చీడపీడలకు సంబంధించి శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను రైతులకు అందించాలన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు పంటల సాగుతోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి ఏడీఏలతోపాటు శాస్త్రవేత్తలు తగిన కృషి చేయాలన్నారు. కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, మాధురి, మానస, భాగవత ప్రియతో పాటు కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్‌లు శనగ, మినుము, ఉలవ, వరి, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటి పంటలను ఆశించే చీడపీడల నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

మేడా భవన్‌లో ఘనంగా
జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మేడా భవన్‌లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలో వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట : రాజంపేట బైపాస్‌లోని మేడా భవన్‌లో శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావు యాదవ్(రాంనగర్ కృష్ణారావు) కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈయనతోపాటు పట్టణ కార్యదర్శి చెంగల్ శివ, ఉమ్మడి జిల్లా గౌడ సంఘం డైరెక్టర్ సుబ్రమణ్యంగౌడ్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు జాహిద్‌అలీ, తాళ్లపాక సర్పంచ్ గౌరీశంకర్, బోయనపల్లె సర్పంచ్ బోగా రాజా, కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివక్ష!

- రోడ్డుకు ఒకవైపు ఆక్రమణలు తొలగించారు..మరోవైపు అలాగే ఉంచారు
- మొత్తం 1.80 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజల వినతి



ఆక్రమణలు తొలగించిన ప్రాంతం

గాలివీడు : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణల తొలగింపులో అధికారుల తీరు వివాదాస్పదమైంది. ఇందుకు ప్రధాన కారణం కూడలిలో రోడ్డుకు ఓవైపు ఉన్న ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు మరోవైపు ఆక్రమణలో ఉన్న నిర్మాణాలను తొలగించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 2266లో మొత్తం 1.80 ఎకరాల భూమి ఆర్ అండ్ బీ స్థలం ఉండగా అందులో శుక్రవారం నాడు అధికారులు రోడ్డుకు ఓవైపు సగభాగం మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. రోడ్డుకు మరోవైపు ఇంకా చాలా వరకు ఆర్ అండ్ బీ స్థలం ఉన్నప్పటికీ అందులో ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించలేదు. అక్కడ ప్రభుత్వ స్థలంలో దర్జాగా అక్రమ నిర్మాణాల్లో దుకాణాలను నడుపుతున్న వారు ధనవంతులు కావడం వల్లనే అధికారులు వారి జోలికి వెళ్లడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు 11 మందికి నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగించిన అధికారులు మరో 15 మంది వరకూ అక్రమ నిర్మాణదారులు ఉన్నప్పటికీ కనీసం వారికి నోటీసులు గానీ, తొలగించమని హెచ్చరికలు గానీ జారీ చేయకపోవడం శోచనీయం అని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

తొలగించిన రేకుల షెడ్ల స్థానంలో కంచె ఏర్పాటు చేయాలి

స్వాధీనం చేసుకున్న ఆక్రమిత స్థలంలో వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు కంచె లేదా బౌండరీ ఏర్పాటు చేసుకుని రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కోట్లు విలువచేసే భూమిని రక్షణ లేకుండా వదిలెయ్యడం వల్లనే ఇలా ఆక్రమణల పాలవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడిని రాళ్లతో కొట్టి హతమార్చారు

- 20 రోజుల తరువాత వెలుగులోకి
- కన్నతండ్రిపై అనుమానాలు
- సీఐ శ్రీనివాసులు వెల్లడి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు : అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం మమ్మిడిగుండ్లపల్లెకి చెందిన గంగులరెడ్డి కుమారుడు సోమశేఖర్ రెడ్డి (36)ని చిత్తూరు జిల్లా పరిధిలో రాళ్లతో కొట్టి చంపేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్‌రెడ్డిని 20 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కొంతమంది చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బోయకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకొచ్చారు. రాళ్లతో కొట్టి చంపేసి వెళ్లిపోయారు. శుక్రవారం రాత్రి దీనిని గమనించిన ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు. హతుడి వద్ద దొరికిన సమాచారాన్ని బట్టి మదనపల్లె మండలం మమ్మిడిగుండ్లపల్లెకి చెందిన సోమశేఖర్‌రెడ్డిగా నిర్ధారించారు. శవం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. ఎముకలు బయటపడ్డాయి. శవానికి అటవీప్రాంతంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ హత్య కేసులో పలురకాల అనుమానాలు ఉన్నాయని, హతుడి తండ్రిపై కూడా ఆరోపణలు ఉన్నాయని సీఐ తెలిపారు. దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉందన్నారు. త్వరలోనే హంతకులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. కాగా హతుడి భార్య, బిడ్డలు మృతి చెందిన కేసులో మదనపల్లె పోలీసులు ఇతనిపై కేసు నమోదు చేసి ఉన్నారని తెలిపారు. ఇలాంటి ప్రవర్తన కలిగిన సోమశేఖర్‌రెడ్డి నడవడిక నచ్చని తండ్రి గంగులరెడ్డి ఈ హత్య చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

భూముల మార్కెట్ విలువ పెంపును నిలుపుదల చేయండి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం పెంచ తలపెట్టిన భూముల విలువను వెంటనే నిలుపుదల చేయాలని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు విన్నవించారు. శనివారం సాయంత్రం వారు జేసీని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2022లో ప్రభుత్వం రాయచోటి ప్రాంతాన్ని అన్నమయ్య జిల్లాగా మార్చిందన్నారు ఫలితంగా రాయచోటి, మాసాపేట, కస్బా గొల్లపల్లె రెవెన్యూ గ్రామాలలోని భూముల మార్కెట్ విలువను 100 నుంచి 300 శాతం పెంచారన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడిపోయిందన్నారు. కాగా ప్రభుత్వం ప్రస్తుతం తిరిగి భూముల మార్కెట్ విలువను పెంచబోతున్నట్లు తెలుస్తోందన్నారు. భూముల విలువ పెంచితే రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింతగా దిగజారుతుందన్నారు. ఇప్పటికే వ్యాపారంలో పెట్టుబడుల కోసం అధికమొత్తంలో అప్పులు చేశామన్నారు. అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేకున్నామన్నారు. అధికారులు ఈ విషయాలను పరిశీలించి భూముల మార్కెట్ విలువ పెంపుదలను నిలుపుదల చేయాలని వారు కోరారు.

ఫ్లెక్సీ వివాద ఘటనలో 13మందిపై కేసు నమోదు



ఫ్లెక్సీ వివాదంలో గాయపడిన బాధితులను పరామర్శిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : ఫ్లెక్సీ వివాదం కారణంగా జరిగిన గొడవలో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ ఆవులపల్లె నల్లరాజుపల్లెలో శుక్రవారం రాత్రి కనసంద్రం వెంకటరమణ వర్గీయులు గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై రమేష్‌నాయుడు వర్గం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఘర్షణలో ఓ వర్గంలోని రమేష్ నాయుడు(32), చక్రపాణి(38), వెంకటరమణ(45), గణేష్(22) గాయపడ్డారు. మరో వర్గంలోని సరోజమ్మ(40) గాయపడింది. బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, వెంకటరమణ, చక్రపాణిల పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఈ ఘటనలో కనసంద్రం వెంకటరమణ వర్గంలోని 13మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఘటనకు సంబంధించి మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో డీఎస్పీ కొండయ్యనాయుడు బాధితులను విచారించారు.

కమ్మేసిన పొగ మంచు



రాయచోటి పట్టణం మదనపల్లి మార్గంలో శనివారం తెల్లవారుజామున కప్పేసిన మంచు

రాయచోటి : రాయచోటి పట్టణంపై శనివారం ఉదయం మంచు దుప్పటి పరుచుకుంది. శనివారం ఉదయం 18 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎత్తయిన భవంతులు, రహదారులన్నీ దట్టమైన పొగమంచుతో తెల్లటి వస్త్రం పరుచుకున్న విధంగా కనిపించాయి. డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమైన చలికి తోడు వారం రోజులుగా తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతోపాటు విపరీతంగా మంచు కురిసింది. దీంతో శనివారం ఉదయం 8.30 గంటలు దాటినా సూర్యుడు కనిపించలేదు. రహదారులపై వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది.

ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ పుష్పగిరి సందర్శన



ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శాస్త్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శాస్త్రి శనివారం సందర్శించారు. మొదట ఆయన పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. శ్రీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి, లక్ష్మీ దేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. అనంతరం ఆయన రుద్ర పాద ఆలయాన్ని, పవిత్ర పినాకినీ నదిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్య నాథేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ మాతను, శ్రీ వైద్యనాథ స్వామి, త్రికుటేశ్వర, భీమ లింగేశ్వర, భీమేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు.

నేటి నుంచి ఈశ్వరీదేవి మఠంలో ఆరాధనోత్సవాలు



బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం సమీపంలో ఉన్న మాతా ఈశ్వరీదేవి మఠంలో ఆదివారం నుంచి 27వ తేదీ వరకు ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన ఉత్సవాలకు సర్వ సిద్ధం చేశారు. ఈమేరకు మఠం ఈఓ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మంగారి కుమారుడు గోవిందస్వామి, గిరియబం దంపతులకు జన్మించిన ఈశ్వరీదేవి 1789లో బ్రహ్మంగారిమఠం సమీపంలో సజీవ సమాధి నిష్ట వహించారు. అప్పటి నుంచి అమ్మవారి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు అమ్మవారి భక్తులు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు నుంచి వస్తారు.